# ఆపరేషన్

● కిరణ్ కుమార్

**బ్యాం**కులో చాలా రద్దీగా వుంది. ఆ రోజు శనివారం అవటాన, మధ్యాహ్నం పన్నెండున్నర గంటలకే బ్యాంక్ లో లేనాదేనాలు ముగించవలసి వుండటాన, బ్యాంకుకు వచ్చిన ప్రతి వ్యక్తి తొందర పడుతున్నాడు.

బ్యాంకులో వున్న రెండు కాష్ పేమెంటు కౌంటర్లలో ఒకదానిలో కాషియర్ రవి కూర్చుని వున్నాడు. రెండు కౌంటర్ల వద్ద జనం పెద్దక్యూలలో నుంచుని వున్నారు.

"ఏరా ! నేనడిగిన విషయం ఏం చేశావు?" అంటూ మెష్‌తో కట్టబడ్డ కాబిన్ తలుపులు తెరుచుకొని రవి దగ్గరకు వచ్చాడు ఆ బ్యాంకులోనే గుమాస్తాగా పనిచేస్తున్న చంద్రం.


బ్యాంక్‌లో పనిచేస్తున్న ఇరవై మంది పనివాళ్ళలో చంద్రం అంటే రవికి చాలా యిష్టం. అందుకు కారణం చంద్రం మంచితనమే ! తను, చంద్రం ఒకే రోజున బ్యాంకులో ఉద్యోగంలో చేరారు. ఆనాటి నుంచీ యిద్దరూ ఎంతో సన్నిహితంగా వున్నారు.

ప్రయత్నం చేస్తున్నానురా....నువ్వేం బెంగపెట్టుకోబోకు. రెండు గంటల ప్రాంతంలో నేను హాస్పటల్‌కు వెళ్ళి డాక్టరుకు వెయ్యి రూపాయలు ఎలాగయినా అందజేస్తాను. వెంటనే నువ్వువెళ్ళి మీ అమ్మగారికి, డాక్టరును ఆపరేషన్ చెయ్యమని చెప్పు." అన్నాడు రవి, కౌంటర్ ముందు నుంచునున్న కస్టమర్‌కి పేమెంటు చేస్తూ.

ఏజెంటువద్ద పర్మిషన్ తీసుకుని హాస్పటల్‌కు వెళ్లాడు చంద్రం.

బ్యాంకును ఆ రోజుకు మూసివేసే టైమ్ అవగానే, తన వద్దనున్న నోట్ల కట్టలు, చిల్లర హెడ్ కాషియర్ భద్రయ్యకు యిచ్చి 'నే నొక గంటలోవస్తాను సార్. నేను చేసే ఓవర్ టైమ్‌లో ఈ గంటా మినహాయించుదురుగాని' అని చెప్పి మార్వాడి సుందర్‌లాల్ దుకాణం మీదుగా హాస్పటల్‌కు వెళ్ళాడు రవి.

మాధూర్సు హాస్పటల్ పట్టణంలో కాన్సర్ ట్రీట్‌మెంటుకు చాలా ప్రసిద్ధి చెందిన హాస్పటల్. ప్రపంచ ఖ్యాతి గడించకపోయినా భారతదేశంలో ఖ్యాతిని పొందిన హాస్పటల్ అది. కాన్సరుకు సంబంధించిన అన్ని శాఖల్లోను, ఆధునిక




పరికరాలతో అమర్చబడిన హాస్పటల్ మాధూర్స హాస్పటల్. ఛార్జీలు కొంచెం ఎక్కువ అయినా వ్యాధి నివారణ ఖాయంగా జరుగుతుందని ఆ హాస్పటల్‌కు పేరు. ప్రతి రోగిపైన డాక్టర్ మాధూర్ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవటం ఆ హాస్పటల్‌లో ప్రత్యేకత. వెల్లూరు ఆసుపత్రిలో రోగ నివృత్తి పొందని వారు కూడా మాధూర్ హాస్పటల్‌లో అడ్మిట్ అయి కోల్కొన్న వుదంతాలు కొన్ని వున్నాయి.

చంద్రం తల్లికి కాన్సర్. ఆమెకా జబ్బు ఆరంభదశలో వుండటంవల్ల మాధూర్ హాస్పటల్‌లో వెంటనే జాయిన్ చేశాడు చంద్రం. వ్యవధి చేయకుండా ఆపరేషన్ చేసినపక్షంలో వ్యాధి నామరూపాలులేకుండా పోతుందని, అందుకు సుమారు పన్నెండొందలు ఖర్చు అవుతుందని చెప్పాడు డాక్టర్ మాధూర్. "ఎంత ఖర్చయినా పర్వా లేదు. మా అమ్మకు జబ్బు నయమవటమే నాకు ముఖ్యం' అనుకున్నాడు, తల్లి తప్ప నా అన్న వాళ్లు ఎవరూ లేని చంద్రం, ఆ మాటే రవితో చెప్పి తనవద్ద అయిదువందలు దాకా రొక్కం వుందని, ఒక వెయ్యి రూపాయలు అతనిని సర్దమని అడిగాడు చంద్రం. రవి తల్లిదండ్రులు బాగావున్న వాళ్ళు కాకపోయినా, కొంతగా వున్న వాళ్ళే. నేను చూస్తాలే అన్నాడు రవి. ఎలాగయినా రవి వెయ్యి రూపాయలు సర్దుబాటు చేయగలడన్న ధైర్యం చంద్రానికి వుంది.

రవి హాస్పటల్‌కు చేరే సరికి చంద్రం అక్కడ లేడు. చంద్రం మందులు కొనుక్కు రావటానికి బైటకు వెళ్ళాడని అక్కడివాళ్ళు చెప్పారు. చంద్రం అమ్మగారు ఆపరేషన్ థియేటర్‌లో వున్నది. తను తెచ్చిన వెయ్యి రూపాయలు డాక్టర్ మాధూర్‌కు యిచ్చి ఆమె కాన్సర్‌ను బాగుచేయటం ఇహ మీ వంతు' అని చెప్పి తిరిగి బ్యాంకుకు వెళ్లాడు రవి, ఓవర్ టైమ్ పని చేయటానికి.

ఏజెంట్ చుట్టు, హెడ్ కాషియర్

భద్రయ్య, మరికొందరు గుమాస్తాలు, ప్యాన్లు నుంచిని వున్నారు.

'చంద్రం నిన్న రవిని ఒక వెయ్యి రూపాయలు సర్దమని అడగటం నేను విన్నాను. వారిలో ఒక గుమాస్తా ఏజెంట్‌తో అంటున్నాడు.

అప్పుడే బ్యాంకులో ప్రవేశిస్తున్న రవిని చూసి 'అడుగో రవి వస్తున్నాడు' అన్నాడు భద్రయ్య:

'ఏమిటి ? ఏమైంది ?' అక్కడ వున్నవారి ముఖాల్ని పరీక్షిస్తూ 'ఏదో అయింది' అని అనుమానిస్తూ అన్నాడు రవి హెడ్ కాషియర్ భద్రయ్యతో.

"నువ్వు ఇచ్చిన కాష్‌లో వెయ్యి రూపాయలు తక్కువ వున్నాయి."

హెడ్ కాషియర్ మాటలకి ఖంగారు పడ్డాడు రవి_"ఎలా తక్కువ వుంటాయి. నేను లెక్క సరిగ్గానే చూశానే !" అనుకొంటూ "హౌ ఇట్ కెన్ బి" అన్నాడు రవి.

"నువ్వే చూడు" అంటూ నోట్ల కట్టల్ని, పేమెంట్ రిజిష్టరు రవి ముందు వుంచాడు ఏజెంట్.

రవి నోట్లకట్టలన్నీ మళ్ళీ మళ్ళీ లెక్కపెట్టాడు. పేమెంటు రిజిష్టరులోని ఎంట్రీలు, టోటల్సు ఒకటికి రెండుసార్లు చేసిచూశాడు. వాస్తవంగా వెయ్యి రూపాయలు తక్కువగా వున్నాయి!

'వెయ్యిరూపాయలు ఏమైనట్టు ? హెడ్ కాషియర్ చాలా నమ్మకస్తుడు. పెద్దవాడు, తన తండ్రికి తెలిసినవాడు; తనపైన ఆప్యాయత గలవాడు. ఆయనని గురించి అన్యథా భావించే ఆస్కారం లేదు. తన సర్వీసు మూడు సంవత్సరాలలో ఎన్నడూ యిలా జరగలేదు. ఇంకెవరు తీసివుంటారు? తన దగ్గరికి రావటానికి ఎవరికీ అవకాశం వుండదే! ఎవరూ లోపలికి రాకుండా యినుప జల్లెడతో కట్టిన కాబిన్‌వుంది. పోనీ పనిచేస్తూ మధ్యలో సీటునుంచి లేచి తను ఎక్కడికీ వెళ్ళలేదే! అసలు ఈరోజు కాబిన్ లోనికి ఎవరూరాలేదు! ఆ(. చంద్రం వచ్చాడు అయినా వాడిలాంటి పని చెయ్యడు. వాడు అలాంటివాడుకాదు. మరి ఎవరు తీసి వుంటారు ? ఎవరికీ అవకాశం లేదు. అలా అయితే చంద్రమే ఈ పని చేసివుంటాడా ! నేను వెయ్యి రూపాయలు యివ్వగలనో లేనో అని తల్లిమీది మమకారంతో ఈపని చేసి వుంటాడా !' రవికి కళ్ళు తిరిగినట్లనిపించింది.

'ఏమంటావు ?' ఏజెంటు రెట్టించినట్టు అడిగాడు.

'ఎలా తక్కువ వస్తుందో నాకు తెలియటంలేదు.'

'పొరపాటున ఏ ఫ్రెండ్ కయినా యిచ్చావేమో గుర్తు తెచ్చుకో' చంద్రం తన అనుమతి తీసుకుని ముందుగా వెళ్ళటం గుర్తు తెచ్చుకుంటూన్నట్టు అన్నాడు ఏజెంట్.

ఏజెంట్ ముఖంలోకి పరీక్షగా చూస్తూ 'ఎవరికీ యివ్వలేదు. అయినా బ్యాంకు సొమ్మును ఎందుకిస్తాను ?' అన్నాడు రవి.

'మరేమయినట్టు ?'

'అదే నాకూ అర్థంకావటం లేదు,' ఆలోచిస్తూ అన్నాడు రవి.

ఏజెంట్ యోచనలో పడ్డాడు—ఏం

చెయ్యటం? రవిని ఎక్కడినుంచయినా తెచ్చి కట్ట మనటమా! ఒకవేళ అతను తెచ్చి కట్టినా, అలా తెచ్చి జమకడితే పూర్తోకావటం భావ్యమా!' ఢిల్లీలోని బ్యాంకు బ్రాంచిలో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. ఏజెంట్‌కు ఢిల్లీ బ్యాంకులో కాషియర్ చేసిన తప్పుకు వెంటనే తగిన చర్య తీసుకొనక పోవటాన, బ్యాంక్ ఏజెంట్ పైన చర్య తీసుకున్నారు పై అధికారులు. వెంటనే టెలిఫోన్ రిసీవర్ను చేతిలోకి తీసుకుని 'పోలీసు కంప్లైంట్ యిస్తున్నాను. వాళ్ళే నిర్ణయిస్తారు.' అన్నాడు ఏజెంట్.

పోలీసులు వచ్చి కాష్‌ని, పేమెంట్ రిజిష్టరును, మిగతా పనివాళ్లను పరిశీలన చేసి, రవిని అరెస్టు చేసినట్టు ప్రకటించి అతన్ని స్టేషన్‌కు తీసుకు వెళ్లారు.

రవి అంటే ఆదరంగల బ్యాంకు ప్యూను కమలాకర్ తిన్నగా చంద్రం దగ్గరకు వెళ్లి జరిగిన విషయమంతా చెప్పాడు.

చంద్రాన్ని ఆశ్చర్యం, భయం, ఖేదం, ఖంగారు అన్నీ కలిసి ఒక్కసారిగా ఆవహించాయి. 'స్నేహితుడి కోసం ఎంత పని చేశావురా రవీ!' అనుకున్నాడు– ఆనాడు బ్యాంకులో ఉద్యోగంలో చేరే సమయంలో, తనకు డిపాజిట్‌గా అయిదొందలు కట్టటానికి స్తోమత లేదని తెలిసి, రవి వాళ్లనాన్నతో అయిదు వందలకు బదులుగా బ్యాంకుకు వెయ్యి రూపాయలు తను (రవి) డిపాజిట్ కట్టాలని అబద్ధం చెప్పి ఆ మిగతా అయిదొందలతో తను కట్టాల్సిన డిపాజిట్ కట్టాడు రవి. తనకోసం యిప్పుడు ఇలా చేశాడు. అసలిదంతా తనవల్లనే జరిగింది. తను వెయ్యిరూపాయలు యివ్వమని అడిగి వుండని పక్షంలో రవి ఈ పని చేసివుండే వాడు కాదు. కారకుడు తను గనక ఫలితం తనే అనుభవించాలి రవి అనుభవించటానికి వీలులేదు.' తనలో తనే అనుకున్నాడు చంద్రం.

చంద్రం పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి సబ్ఇన్‌స్పెక్టర్‌ను కలిశాడు.

'సార్. రవి పని చేస్తున్న బ్యాంకులోనే నేను గుమాస్తాగా పనిచేస్తున్నాను. నాపేరు చంద్రం. ఆ వెయ్యి రూపాయలు నేను తీసుకొన్నాను, రవి కూర్చునే కాష్ కాబిన్‌లోకి వెళ్ళి అతను పేమెంట్ చేస్తూ హడావిడిలో వుండగా పది వందరూపాయిల నోట్లను, హాస్పటల్లో ఆపరేషన్ చేయబడుతూన్న మా అమ్మగారి కయే హాస్పటల్ ఖర్చుకుగాను నేను తీసుకున్నాను. చంద్రం తల వంచుకుని – మీరేం శిక్ష వేసినా నేను అనుభవించటానికి సిద్ధంగా వున్నానన్నట్లు చెప్పాడు సబ్ఇన్‌స్పెక్టరుతో.

'ఆ నోట్లు ఏవీ?' ఎస్. ఐ. ప్రశ్నించాడు.

-నేను సిటీబస్‌లో ఎక్కి బ్యాంకు నుంచి ఇంటికి వెళుతూంటే, ఎవరోజేబు కొట్టేశారు. ఇదిగో జేబుకున్న బ్లేడ్‌కట్ చూడండి.' తనపాంటు వెనకజేబుకున్న బ్లేడ్‌కట్‌ను చూపించాడు చంద్రం ఎస్. ఐ.కి

చంద్రాన్ని మరికొన్ని ప్రశ్నలడిగి

అరెస్టుచేసి లాకప్‌లో పెట్టాడు సబ్ ఇన్‌స్పెక్టరు.

రవిచేత వ్యక్తిగత హామీ పత్రాన్ని రాయించుకుని విడుదల చేశాడు.

చంద్రం వున్న కటకటాల గది దగ్గరకు వెళ్ళి వణుకుతున్న కంఠంతో 'చంద్రం' అన్నాడు రవి.

'రవీ! జరిగిందేదో జరిగిపోయింది. నువ్వు బాధపడకు. మా అమ్మ హాస్పిటల్లో వుంది. నువు అక్కడికి వెళ్ళవూ!' ప్రాధేయపడుతూన్నట్టు అడిగాడు చంద్రం.

"అలాగే" నిర్లిప్తంగా పోలీస్‌స్టేషను నుంచి బైటకు నడిచాడు రవి.

ఆదివారం న్యాయస్థానాలకు సెలవు దినం గనక, సోమవారం మేజస్ట్రేట్ ముందు హాజరు పరచటానికి సన్నాహాలు చేస్తూ చంద్రాన్ని లాకప్‌లోనే వుంచారు పోలీసులు.

* * *

సోమవారం మామూలుగా బ్యాంకు తెరవబడింది.

"ఏజెంట్‌గారున్నారా?" అంటూ ఏజెంట్ రూములోకి వెళ్లాడు కంట్రాక్టర్ హరిశ్చంద్రరావు.

"రండి, కూర్చోండి."

"థాంక్యూ. అయామ్ సారీ. నిన్న మీకు హాలిడే అవటాన బ్యాంకుకు రాలేక పోయాను. శనివారంనాడు నేనునాకరంట్ ఎకవుంట్ నుంచి మూడు వేలు విత్‌డ్రా చేశాను. మీకు జ్ఞాపకం వుందనుకుంటాను.' తన చేతిలో వున్న హాండ్‌బాగ్ తెరుస్తూ ఏజెంట్‌తోఅన్నాడు హరిశ్చంద్రరావు.

'అవును' అన్నాడు ఏజెంట్.

'నేను మీ కాష్ కవుంటర్ దగ్గర పైకం తీసుకున్నాక దారిలోకొన్నిపనులు చూసుకుని, ఇంటికి చేరేసరికి రాత్రి ఎనిమిది గంట లయింది. అంత వరకు మీ కాషియర్ ఇచ్చిన పైకాన్ని నేను లెక్క చూడలేదు. సేఫ్‌లో పెడుతూ లెక్క చూస్తిని గదా, మూడు వేలకు బదులుగా నాలుగువేలున్నాయి. మీకాషియర్ ముప్ఫై వందరూపాయల నోట్లకుబదులు, నలభై వందరూపాయలనోట్లు యిచ్చాడు. ఇవిగో ఆ వెయ్యి రూపాయలు.' అంటుపది వంద రూపాయలనోట్లని లెక్కించి ఏజెంట్‌కు ఇచ్చాడు. హరిశ్చంద్రరావు.

ఏజెంట్ ముఖంలో జీవం నశించినట్లయినా, తిరిగి సరుకుని ఆ వెయ్యిరూపాయలు తన చేతిలోకి తీసుకున్నాడు.

'థాంక్స్. శనివారం నాడే షార్టును కనిపెట్టి నేను సర్దేశాను' అన్నాడు ఏజెంట్.

'వస్తాను సార్' హరిశ్చంద్రరావులేచి నుంచున్నాడు.

హరిశ్చంద్రరావు బైటకు వెళ్ళగానే వెయ్యి రూపాయలను తన పర్సులో జాగ్రత్తగా పెట్టుకున్నాడు ఏజెంట్.

చంద్రం మీద ఎటువంటి నెపము వేయకుండా జరిగిన సంఘటన తనతల్లితో చెప్పి ఆమె నగలను తాకట్టు పెట్టించి, వెయ్యి రూపాయలు తీసుకుని బ్యాంకుకు కట్టాడు రవి.

సాక్ష్యాలను పరీక్షించి, చంద్రానికి ఒక సంవత్సరం కఠిన శిక్ష న్యాయస్థానం విధించటంతో, అతన్ని ఉద్యోగంనుంచి తొలగించింది బ్యాంకు.

చంద్రం ఏడీబాబు?' హాస్పటల్‌నుంచి పూర్తిగా కోలుకుని ఇంటికి వస్తూ, వెంట వున్న రవిని అడిగింది, చంద్రం తల్లి.

'బ్యాంకు వారు ట్రైనింగ్‌కు పంపించారమ్మా. వాడు తిరిగి వచ్చేసరికి కొంత కాలం పడుతుంది. అంతవరకు నేనే మీ అబ్బాయిని' అన్నాడు రవి.

చంద్రం జైలునుంచి విడుదలయినా చంద్రం–రవితో కానీ, రవి చంద్రంతో గానీ పోయిన వెయ్యి రూపాయల విషయం ప్రస్తావించి ఎరుగరు! ఆ సంఘటనే జరగనట్లు మసలటం మంచి దన్న భావన ఇద్దరిలోను వుంది.

మరొక ఉద్యోగం దొరక్క బికారిగా తిరుగుతున్నాడు చంద్రం. చంద్రాన్ని ఆర్థికంగా తనకు చేతనయినంత ఆదుకుంటున్నాడు రవి. బ్యాంకు ఏజెంటుకు ఆ విషయం తెలిసినా చలించలేదు. ఎవరెవరిదిగ్గర ఎంతెంత సొమ్ము తీసుకున్నాడో అతనికే లెక్క–తెలియదు. వాటి వివరాలు వుంచటం తనకే ముప్పని ఎరిగిన వ్యక్తి బ్యాంక్ మేనేజర్. కానీ తన కుమార్తె మెడలోని రాళ్ళ నెక్లెస్ చూచినప్పుడుమాత్రం, అతనికి 'చేతచిక్కిన వెయ్యి రూపాయలు తిరిగి బ్యాంకులో తనకిచ్చిన హరిశ్చంద్రరావు' జ్ఞాపకం వచ్చేవాడు. పిచ్చివాడు బ్రతకటం తెలియనివాడు అనుకునేవాడు మేనేజర్.

శరీరానికి కాన్సర్‌వస్తే ఆపరేషన్ చేసి బాగుచేస్తున్నారు వైద్యులు, మేధకు ఏర్పడ్డ కాన్సర్‌కు ఆపరేషన్ చేయగలిగింది వైద్యులుకాదు. సమాజం; అందులోని మానవులు మాత్రమే।

---


## చందా వివరాలు

| | |
|---|---|
| విడి ప్రతి | రు. 2-00 |
| సంవత్సరం చందా | 25-00 |
| (ఆగస్టు 15 సంచిక విడి ప్రతి 3-00) | |
| సంక్రాంతి స్పెషల్ | 5-00 |
| మొత్తంగా | 30-00 |

## అనామిక ప్రకటన రేట్లు

| | |
|---|---|
| కవరు పేజి | రు. 300-00 |
| 2 & 3 కవరు పేజి | 250-00 |
| ఓపెనింగ్ | 250-00 |
| పూర్తి పేజి | 200-00 |
| పేజిలో సగం | 100-00 |

"అనామిక" అన్ని హిగ్గిన్ బాదమ్సు, రైల్వే బుక్ స్టాల్సులోను దొరుకుతుంది.